# సూటబుల్ మేచ్

-వాణిశ్రీ

కుమారస్వామి వాచీవైపు చూసుకున్నాడు.

నాలుగున్నర దాటింది.

ఇక ఇంటికి బయల్దేరడానికి బీరువాకి తాళం వేసాడు. హేండ్ బేగ్ సర్దుకుని లేద్దామనుకుంటూ వుండగా టెలిఫోన్ రింగైంది.

రిసీవర్ ఎత్తి ''ఎస్'' అన్నాడు.

''కుమారస్వామి''

''ఎస్ స్పీకింగ్''

''నేనోయ్ బ్రహ్మానందాన్ని''

''చెప్పు''

''నేను ఇంతకుముందు చెప్పానే భరత్‌కుమార్ అని కుర్రాడున్నాడని, అతనూ లీవు నుంచి వచ్చాడు. నువ్వా కుర్రాడ్ని చూసి మాట్లాడి ఓకే అనుకుంటే అమ్మాయిని చూపిద్దాం. ఏమంటారు?''

''అలాగే''

''నువ్వు సరిగ్గా ఆరుగంటలకు పార్క్ రెస్టారెంట్‌కు వచ్చేయ్. నేనా కుర్రాడ్ని తీసుకుని అక్కడికి వస్తాను''

''అది సరే. ఆ కుర్రాడు ఎక్కడ పని చేస్తున్నాడన్నావ్?''

''ట్రెజరీ కమీషనర్ ఆఫీసులో సీనియర్ అసిస్టెంట్''

''సరే. నేను వస్తున్నాను''

''వుంటామరి''

కుమారస్వామి రిసీవర్ పెట్టేసి వాచీవైపు చూసాడు.

పావుతక్కువ ఐదైంది.

పార్క్ రెస్టారెంట్ అక్కడికి దగ్గరే. పది నిముషాల్లో వెళ్లిపోవచ్చు. ఇంకా టైముంది. ఐదున్నరకి బయలుదేరవచ్చు అనుకుని అట్లాగే కూర్చుండిపోయాడు.

కుమారస్వామి సెక్రటేరియట్‌లో అసిస్టెంట్ సెక్రటరీ. గుమస్తాగా చేరిన అతను అంచెలంచెలుగా ప్రమోషన్లు వచ్చి ఆరేళ్లక్రితం ఆఫీసరయ్యాడు. ఇంకొక సంవత్సరంలో రిటైర్ కాబోతున్నాడు. పెద్దమ్మాయి పెళ్లి చేసాడు. ఇద్దరు కొడుకులూ జాబ్స్‌లో సెటిలయ్యారు. రిటైరయ్యేలోగా చిన్నమ్మాయికి కూడా పెళ్లి చేయాలని ప్రయత్నం చేస్తున్నాడు. తన సర్కిల్లో ఫ్రెండ్స్ అందరికీ చెప్పి వుంచాడు మంచి సంబంధం చూడమని. అదృష్టవశాత్తు మంచి సంబంధం కుదిరి పెళ్లయిపోతే హాయిగా రిటైరైపోవచ్చు అనుకున్నాడు.

★★★

''ఇతనేనోయ్ భరత్‌కుమార్'' బ్రహ్మానందం పరిచయం చేసాడు కుర్రాడిని. కుమారస్వామికి నమస్కారం చేసాడు అతను.

ముగ్గురూ ఒక టేబుల్ ముందు కూర్చున్నారు. బ్రహ్మానందం కాఫీకి ఆర్డరిచ్చాడు.

''మీ గురించి బ్రహ్మానందం అంకుల్ చెప్పారు సార్. అప్పట్లో మీరు నాటకాలు వేసేవారటగా. పరిషత్తుల్లో కూడా ప్రైజులు వచ్చాయని, మంచి నటులనీ...''

భరత్‌కుమార్ మాటలకు అడ్డు వస్తూ ''అదంతా గత జన్మ'' అని నవ్వాడు కుమారస్వామి.

''ఐ లైక్ ఆర్టిస్ట్సు అంకుల్''

''థాంక్స్''

''మరి మీరు సినిమాల్లో వేషాలు వేయాలనుకోలేదా?''

''చూడబ్బాయ్! నాటకాలు వేరు, సినిమాలు వేరు. ఒకప్పుడు నాటకరంగంలో ఉద్దండులైన నటులు సినిమాల్లో రాణించారు. అప్పట్లో ఎక్కువగా పౌరాణికాలు, జానపదాలు నిర్మించేవారు. అదీగాక నటీనటులు ఎవరిమాట వాళ్లే మాట్లాడాలి. ఎవరి పాట వాళ్లే పాడుకోవాల్సి వచ్చేది. తర్వాత రోజులు మారాయి. డబ్బింగ్ సిస్టం వచ్చింది. చూస్తున్నావుగా తొంభై పర్సంట్ నటీనటులకు అరువు గొంతులే. కెమెరా ముందు నిలబడి ఏవేవో బూతులు మాట్లాడితే చాలు'' అన్నాడు కుమారస్వామి.

ఇద్దరూ నవ్వారు.

''అయినా ప్రతిభకి పట్టంకట్టే పరిస్థితి సినిమా ఫీల్డులోలేదు. రాజకీయాల్లాగానే సినిమా ఫీల్డులో కూడా వారసులు రాజ్యం ఏలుతున్నారు. అక్కడెవరైనా గాడ్ ఫాదర్ వుంటే తప్ప ఎంత గొప్ప నటుడైనా నిలదొక్కుకోలేడు. ఒక ఉదాహరణ చెప్తాను విను. నా ఫ్రెండ్ కృష్ణమూర్తి పరిషత్తులో బెస్ట్ యాక్టర్‌గా బహుమతులు పొందాడు. అతని నాటకాలు చూసిన సినిమా నిర్మాతా దర్శకులు మద్రాస్ వస్తే వేషాలిస్తామని అన్నారు. గవర్నమెంటు ఉద్యోగం వదులుకుని వేషాల కోసం వెళ్తే ఎలా వుంటుందోనని భయపడ్డాడు కృష్ణమూర్తి. ఐతే ఒక ప్రముఖ దర్శకుడు తన చిత్రంలో పెద్ద వేషం అంటే మెయిన్ విలన్ ఇచ్చేసరికి ఎగిరిగంతేసి ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి మద్రాస్ వెళ్లాడు. సినిమా రిలీజ్ తర్వాత అతను గొప్ప నటుడన్నారుగానీ పొగిడినవాళ్లు వేషాలు ఇవ్వలేదు. నాటకరంగంలోలా అతను అక్కడ రాణించలేకపోయాడు. అదృష్టం కూడా కలసి రావాలనుకో''

''కాఫీ చల్లారిపోతున్నది. తీసుకోవోయ్'' అని బ్రహ్మానందం మిత్రుడి ఆవేశానికి అడ్డుకట్ట వేసాడు.

''నేను కవిత్వం రాస్తుంటాను సార్'' అంటూ బేగ్‌లోంచి ఒక పుస్తకం తీసి కుమారస్వామికి అందించాడు భరత్‌కుమార్.

టైటిల్ 'కల్తీ' అని వుంది.

అట్టమీద సముద్రంలో మునిగిపోతున్న సామాన్యుడి బొమ్మ వుంది.

లోపల భరత్‌కుమార్ కవిత్వాన్ని పరిచయం చేస్తూ ముగ్గురి విమర్శకుల వ్యాసాలున్నాయి. అట్ట వెనుక భరత్‌కుమార్ ఫోటో వుంది.

పుస్తకం తిరగేసి ''బాగుంది. అయితే మీరు కవి అన్నమాట'' అన్నాడు కుమారస్వామి నవ్వుతూ.

భరత్‌కుమార్ సిగ్గుతో మెలికలు తిరిగాడు.

''నాకు కళంటే ఇష్టం. కాలేజీలో కల్చరల్ సెక్రటరీగా పని చేసాను. ఈ కాలనీలో చైతన్య కళాసమితికి నేనే సెక్రటరీని. అప్పుడప్పుడు కల్చరల్ ప్రోగ్రామ్స్ అరేంజ్ చేస్తుంటాం'' చెప్పాడు భరత్‌కుమార్.

తర్వాత భరత్‌కుమార్ తండ్రి వివరాలు వాళ్ల ఆస్తిపాస్తులు అడిగి తెలుసుకున్నాడు కుమారస్వామి.

పార్క్ హోటల్ నుంచి బైటకు వచ్చాక భరత్‌కుమార్ తన బస్టాప్‌వైపు వెళ్లాడు ఇద్దరి దగ్గరా సెలవు తీసుకుని.

''ఎట్లా వున్నాడు కుర్రాడు?'' అడిగాడు బ్రహ్మానందం.

''బాగానే ఉన్నాడు''

''ఎత్తు బాగానే వున్నాడు. వయసు ఇరవై ఎనిమిది. అమ్మాయికి ఇరవై రెండుకదా. ఈడూజోడూ ఓకే. ఏమంటావ్?''

''అవునవును''

''పంతుల్ని అడిగి మంచి రోజు ఏదో నాకు చెప్పు. వాళ్లని పెళ్లిచూపులకు తీసుకొస్తాను. అమ్మాయి నచ్చితే ఇక మిగతా విషయాలు మాట్లాడుకోవచ్చు.''

''అది సరే ఇంతకీ ఎంతలో వున్నారు వాళ్లు?''

''ఏమిటి?''

''కట్నం''

బ్రహ్మానందం నవ్వాడు.

''అతను కానీ కట్నంగా పుచ్చుకోడు. మొండిఘటం అనుకో. నువ్వు కట్నం బదులు అమ్మాయికి ఏదైనా ఇస్తానన్నా ఒప్పుకోడు. ఆఫీసులో కూడా మహా స్ట్రిక్ట్. లంచాలు తీసుకోడు''

''వ్వాట్ కట్నం పుచ్చుకోడా''

''అవునోయ్! చెవుడా?''

కుమారస్వామి ఆశ్చర్యంగా చూసాడు బ్రహ్మానందాన్ని.

''నిజంగా ఇటువంటి కుర్రాడు దొరకడం నీ అదృష్టం అనుకో. బంగారుకొండ. నాకు కూతురు లేకపోబట్టి నీదాకా రానిచ్చానోయ్. లేకపోతే నేనే అల్లుడిగా

చేసుకునేవాడిని'' అన్నాడు బ్రహ్మానందం.

''కట్నం వద్దని ఇంకేమైనా అడుగు తారా కొంపదీసి. హైదరాబాద్‌లో ఒక ఇల్లు కొనివ్వమన్నారనుకో. ఆరిపోతాను. అదీ గాక హీరో హోండా, కలర్ టీవీ, ఫ్రిజ్... అంటూ ఇవ్వమంటారనుకుంటా'' సందేహం వెలిబుచ్చాడు కుమారస్వామి.

''ఛా... నీదంతా వట్టి అనుమానమేనోయ్. వాళ్ల ఫ్యామిలీ అట్లాంటిదికాదు. వాళ్ల ఫాదర్ కూడా ఐడియల్ జెంటిల్‌మేన్. వాళ్ల తాత గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు. మన చిన్నప్పుడు చెప్పుకునేవాళ్లుచూడు కలెక్టరాఫీసు మీద కాంగ్రెస్ జెండా ఎగరేస్తే లాఠీలతో చచ్చేట్టు కొట్టారని. ఆయన వీళ్ల తాతే''

''నువ్వెన్నన్నా చెప్పు. ఈ రోజుల్లో కట్నం తీసుకోరంటే నేను నమ్మలేకుండా వున్నాను. అదీ అతగాడు నిరుద్యోగి, చదువుసంధ్యలు లేనివాడు కాడు. ఎమ్మె చదివి గవర్నమెంటు ఆఫీసులో ఉద్యోగం చేస్తున్నాడు.''

''నువ్వు లేనిపోని అనుమానాలు పెట్టుకోకోయ్. అంతా పిల్ల అదృష్టం అనుకో. అదిగో బస్ వస్తోంది వెళ్తా. పంతుల్తో మాట్లాడి ఫోన్ చెయ్'' అంటూ బ్రహ్మానందం సిటీబస్సువైపు పరిగెత్తాడు.



★★★

ఆ తర్వాత కుమారస్వామి నుంచి బ్రహ్మానందానికి ఫోన్ రాలేదు. నాలుగైదు రోజులు చూసి తనే ఫోన్ చేస్తే లేడన్నారు. ఏదో కాన్ఫరెన్స్‌లో వున్నాడన్నారు. తను ఫోన్ చేసినట్టు చెప్పమంటే సరేనన్నారు. అయినా మరోవారం తర్వాత కూడా కబురూ కాకరకాయ లేదు. మళ్లీ ఫోన్ చేసాడు బ్రహ్మానందం. సెలవులో వున్నాడని చెప్పారు.

బ్రహ్మానందానికి కొంచెం కోపం వచ్చింది.

'వెధవ! అవసరం వాడిదా? నాదా? ఏదైనా సంబంధం చూడవోయ్ అని పదిసార్లు చెప్పాడు. బంగారంలాంటి సంబంధం చూపిస్తే రెస్పాన్సేలేదు. ఇక ఛస్తే ఫోన్ చెయ్యనుగాక చెయ్యను. అవసరమైతే వాడే చేస్తాడు' బ్రహ్మానందం భీష్మించుకున్నాడు.

అయినా ఫోన్ రాలేదు.

రెండు నెలల తరువాత కుమారస్వామి దగ్గర్నుంచి వెడ్డింగ్ కార్డు వచ్చింది. హైదరాబాద్‌లోనే రాయల్ కోర్టులో పెళ్లి. కుర్రాడి పేరు చక్రధరరావు అని వుంది. వాళ్లది గుంటూరట. వరుడి క్వాలిఫికేషన్ వివరాలేమీలేవు దానిలో.

పెళ్లికి వెళ్లాడు బ్రహ్మానందం.

కళ్యాణ మండపానికి ఇంకా వరుడిని తీసుకుని రాలేదు. ఇంకా రెండుగంటలు టైముంది. ఆహుతులు పలచగా వున్నారు. అప్పుడే రావడం మొదలుపెట్టారు.

బ్రహ్మానందాన్ని చూసి ఎదురు వచ్చి ''రావోయ్ రా'' అంటూ ఆహ్వానించాడు కుమారస్వామి.

ఇద్దరూ కుర్చీల్లో కూర్చున్నారు.

''ఏం చేస్తున్నాడు కుర్రాడు'' ప్రశ్నించాడు బ్రహ్మానందం.

''జూనియర్ అసిస్టెంట్''

బ్రహ్మానందం ఆశ్చర్యంతో నోరు తెరిచాడు.

''ఏమిటోయ్ అంత ఆశ్చర్యం?''

''ఆహా ఏంలేదు. కట్నం ఎంతేమిటి?''

''రెండు లక్షలు''

బ్రహ్మానందం ఏం మాట్లాడలేకపోయాడు. కళ్లు తిరుగుతున్నట్టనిపించింది. కానీ కట్నం అడగని సీనియర్ అసిస్టెంటుని తను చూపిస్తే రెండులక్షలు కట్నం ఇచ్చి జూనియర్ అసిస్టెంట్‌కి పిల్లనిస్తున్న వాడిని ఏమనాలి?

బ్రహ్మానందం అయోమయంగా చూసాడు.

అతని అవస్థని కనిపెట్టి పకపకా నవ్వాడు కుమారస్వామి.

''నువ్వు ఏం ఆలోచిస్తున్నావో నాకు తెలుసులేవోయ్. నీ సందేహం నాకు అర్థమైంది. నువ్వు సీనియర్ అసిస్టెంట్ సంబంధం తెచ్చావ్. పైగా అతను కట్నం అడగడు. నేనేమో జూనియర్ అసిస్టెంట్‌కి రెండు లక్షల కట్నం ఇచ్చి పెళ్లి చేస్తున్నాను. అది పిచ్చి పనిగా నీకు అనిపిస్తున్నది అవునా?''

బ్రహ్మానందం తల వూపాడు.

''కాలంతోపాటు పరిగెత్తాలోయ్ మనిషి. లేకపోతే వెనుకపడిపోతాడు. ఎవడికైనా మనుగడ సాగించాలంటే, సుఖంగా జీవించాలంటే లోకజ్ఞానం అవసరమోయ్. అది ఆ కుర్రాడి దగ్గర కన్పించలేదు నాకు. ఇప్పుడు కట్నం తీసుకోడు. బాగానే వుంది. రేపు అతగాడికి ఇద్దరు ఆడపిల్లలు పుట్టారనుకుందాం. వాళ్లని కట్నం లేకుండా ఎవరు పెళ్లి చేసుకుంటారు? లంచాలు ముట్టడన్నావ్? ఇక బాగుపడ్డట్టే. అతగాడు రిటైరయ్యేనాటికి స్వంత కొంప కూడా సమకూర్చుకోలేడు ఈ సిటీలో. ఇక వాడిని చేసుకున్న మా అమ్మాయి సుఖంగా జీవితం సాగించగలదా? అంతా దరిద్రమే కదూ? ఎందుకొచ్చిన చౌక దరిద్రం మాకు? పైగా కవినంటూ పిచ్చిమాటలొకటీ''

కుమారస్వామి మాటలకు నోరెళ్లబెట్టాడు బ్రహ్మానందం.

''ఈ కుర్రాడు జూనియర్ అసిస్టెంట్ అయితేనేం? సేల్స్‌టాక్స్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం. చేరి నాలుగేళ్లయిందిట. చెక్‌పోస్టు డ్యూటీ అట. అప్పుడే నాలుగులక్షలు వెనకేశాడుట''కుమారస్వామి గర్వంగా చెప్పుకుపోతున్నాడు.

★